జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం



మంగళవారం | 25 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7

## యాప్‌లో బుకింగ్ కష్టాలు.. ఎరువులు అందక రైతుల ఎదురుచూపులు



**సత్తుపల్లి ఆగస్టు24 (ప్రజా జ్యోతి)** మండలం పరిధిలోని తుంబూరు గ్రామంలో నిసొసైటీలోయూరియా కొరతపై రైతులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్ ద్వారా తుంబూరు సొసైటీకి సంబంధించిన రైతులకు యూరియా బుక్ కావడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అయితే ఇతర సొసైటీలకు చెందిన రైతులు అదే యాప్‌లో యూరియా బుక్ చేసుకుంటే

మిగతా 2 లో...

## అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి




- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- నోటీసులు జారీ చేసే సమయంలోనే అవసరమైన పత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలి
- ఎస్ఐఆర్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు కలిపి సుమారు 1.75 లక్షల నోటీసులు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్ చేసినట్లు వివరించారు.అనామలీస్ క్రింద సుమారు 80 వేల మంది ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు.అనామలీస్,మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన ఓటర్లను విచారణకు పిలిచేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు

మిగతా 2 లో...





## ఖమ్మం వైద్యరంగంలో నవశకం

- 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం..
- మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రూ.23.75 కోట్లతో అత్యాధునిక భవనాలు మరియు సదుపాయాల కల్పన
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యం
- తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు
- హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం
- మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సాకారమైన కీలక ప్రాజెక్టు

**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) ఆగస్టు: 24** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజారోగ్య చరిత్రలో మరో కీలక అధ్యాయానికి నాంది పలికేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధమైంది.ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గడప తొక్కే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే రోగులకు సత్వరమే అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఈ సదుపాయం ఎంతో దోహదపడనుంది. ఇది కేవలం ఒక భవన ప్రారంభోత్సవం కాదు... ఖమ్మం జిల్లా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం వేసిన మరో దృఢమైన అడుగుగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల వేసిన అడుగులు కృషి నేడు ఫలించింది.

**రూ.23.75 కోట్లతో రూపుదిద్దుకున్న అధునాతన నిర్మాణం...**

ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.23.75 కోట్ల భారీ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2023 జూన్ 7న జారీ అయిన జీవో ఆర్‌టీ నంబర్ 311 ద్వారా

మిగతా 2 లో...

## నేడు జిల్లాల్లో ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి
- మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి
- ఖమ్మం జిల్లాలో 31.30 లక్షల లక్ష్యానికి గాను 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యం పూర్తి
- ఆగస్టు 25న మంగళవారం ఖమ్మం జిల్లాలో ఒకే రోజు లక్ష మొక్కలు నాటేలా కార్యాచరణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటే ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో పచ్చదనం,పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను, డిఎఫ్ఓ లను ఆదేశించారు.వన మహోత్సవ కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఎఫ్ఓలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. తక్కువ ప్రగతి సాధించిన జిల్లాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 9 శాతం లక్ష్యం

మిగతా 2 లో...

# ఖమ్మం వైద్యరంగంలో నవశకం

(మొదటి పేజీ తరువాయి...)

ఈ అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు వేగం పెరిగింది. రూ.12.66 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ చేపట్టగా, 2.79 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టు ఖరారు కావడం విశేషం. ఇప్పటివరకు నిర్మాణానికి సుమారు రూ.15.27 కోట్లు వెచ్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**వైద్య పరికరాలకు రూ. 8.48 కోట్లు కేటాయింపు..**

మంజూరైన మొత్తం నిధుల్లో నిర్మాణ వ్యయం పోను మిగిలిన రూ.8.48 కోట్లను అత్యాధునిక వైద్య పరికరాల సమకూర్పుకు వినియోగించనున్నారు. దీనితో కేవలం భవనం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా క్రిటికల్ కేర్ చికిత్సలో నాణ్యత మరింత మెరుగుపడనుంది.

**నాలుగంతస్తుల్లో సమగ్ర వైద్య సదుపాయాలు..**

నాలుగు అంతస్తుల్లో విశాలంగా నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల అవసరాలకు అనుగుణంగా వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు. – రెండు ఐసీయూ విభాగాల్లో 20 పడకల చొప్పున 40 పడకలు – 20 పడకల జనరల్ వార్డు – 5 పడకల డయాలసిస్ వార్డు గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వైఫల్యం తదితర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అవసరమైన క్రిటికల్ కేర్ సేవలను ఒకే చోట అందించే అవకాశం ఏర్పడనుంది.

**హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం..**

ఇప్పటివరకు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులను మెరుగైన క్రిటికల్ కేర్ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ప్రయాణ సమయం కీలకంగా మారేది. తాజాగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి రానుండటంతో అత్యవసర సమయంలో విలువైన సమయం ఆదా కావడంతో పాటు రోగుల ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఖమ్మం జిల్లావాసులతో పాటు చుట్టుపక్కల మండలాలు, పొరుగు జిల్లాల ప్రజలు కూడా ఈ సదుపాయం ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**ప్రభుత్వ వైద్యానికి మరింత బలం..**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుండటం జిల్లా వైద్య రంగానికి ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.

**నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం..**

సుదీర్ఘ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నేడు లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ అత్యాధునిక వైద్య సదుపాయం ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవల చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించనుంది.

## అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి




(మొదటి పేజీ తరువాయి...)

కలెక్టర్ తెలిపారు. నోటీసులు జారీ చేసే సమయంలోనే సంబంధిత ఓటర్లు విచారణకు హాజరయ్యే సమయంలో సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఎస్ఐఆర్ ప్రక్రియపై మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.వీడియో సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని తెలిపారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ.రాజు, డీటీ అన్సారీ,ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాప్‌లో బుకింగ్ కష్టాలు.. ఎరువులు అందక రైతుల ఎదురుచూపులు



(మొదటి పేజీ తరువాయి...)

ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు.పంటలు వేసి దాదాపు రెండు నెలలు కావస్తున్నా,ఇప్పటివరకు యూరియా అందకపోవడంతో పంటల దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా బుకింగ్‌కు 5జీ ఫోన్ అవసరమని సొసైటీ సిబ్బంది చెబుతున్నారని, అయితే 5జీ ఫోన్‌లో ప్రయత్నించినా యూరియా బుకింగ్ కావడం లేదని మరికొందరు రైతులు వాపోతున్నారు.యూరియా కొరత సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించి,తుంబూరు సొసైటీ పరిధిలోని రైతులకు అవసరమైనమేరకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

## నేడు జిల్లాల్లో ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమం




(మొదటి పేజీ తరువాయి...)

మాత్రమే పూర్తయిందని, హెచ్ఎండీఏ, సూర్యాపేట, 3 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, సంగారెడ్డి ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువ లక్ష్యం పూర్తయిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వేగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.వన మహోత్సవంలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. మొక్కల మనుగడ శాతం అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలని అన్నారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల పరిస్థితిపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.ఇటీవల కురుస్తున్న వర్షాలు,రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా వినియోగించుకొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ చివరి నాటికి అన్ని లక్ష్యాలను పూర్తి చేసేలా కలెక్టర్లు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.వన మహోత్సవంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భారీ స్థాయిలో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలని సూచించారు.మంగళవారం నిర్వహించే సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాలపై ప్రజలకు మంచి సందేశం వెళ్లేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో సాధ్యమైన చోట అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. దేవాలయ పరిసర ప్రాంతంలో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికా బద్ధంగా మొక్కలు నాటాలని అన్నారు.బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని,అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని, నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని మంత్రి ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు.

**ఖమ్మం జిల్లాలో 67 శాతం లక్ష్యం పూర్తి**

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వన మహోత్సవం క్రింద 31.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు సుమారు 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు.మంత్రి సూచనల మేరకు మంగళవారం జిల్లాలో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 2 లక్షలకు పైగా గుంతలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళవారం ఒకే రోజు 1 లక్ష మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నామని, ఖమ్మం నుంచి వ్యవసాయ శాఖ మంత్రి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.మండల, గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మంగళవారం 1 లక్ష మొక్కలు నాటే లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. మండలాల వారీగా స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని డిఎఫ్ఓకు సూచించారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అన్ని వర్గాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ బి. శిరీష, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అయితగాని రాంగోపాల్ కుటుంబాని మంత్రి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ





**పాలేరు ఆర్. సీ ఆగస్టు24 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అయితగాని రాంగోపాల్ తండ్రి నాగేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇంచార్జి బీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సోమవారం అయితగాని నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంగోపాల్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు జుకూరి గోపాల్ రావు, మదాసు ఉపేందర్,బారి వీరభద్రం ,కంచర్ల జీవన్ రెడ్డి,సర్పంచులు అయిత గాని వెంకటరమణ నాగేశ్వరరావు, కొండ కృష్ణవేణి మహిపాల్, వడిత్య వెంకటేష్, జీళ్ళచేర్వు గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు నివాళులర్పించారు.

# గంజాయి నియంత్రణకు యాక్షన్ ప్లాన్ ఇతర రాష్ట్రాల మద్యం సరఫరా ఎట్టి పరిస్థితిలో క్షమించం

- ఎమ్మార్పీ కి మించి మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం
- ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఆర్.కిషన్



**నేలకొండపల్లి, ఆగస్టు 24 ప్రజా జ్యోతి** :గంజాయి నియంత్రణ కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ను ఏర్పాటు . చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఆర్.కిషన్ పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడా రు...ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకి గంజాయి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాచలం లో ప్రత్యేకంగా ఎన్ఫోర్స్మెంట్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం ప్రత్యేక నిఘా ద్వారా గంజాయి ని కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. 'ఉమ్మడి జిల్లా ను సారా రహిత డివిజన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతర్ రాష్ట్ర చెకోపోస్టుల ద్వారా ఎన్డీపీ మద్యం ను అరికడుతున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల మద్యం ను ఎట్టి పరిస్థితులలో క్షమించేది లేదన్నారు. అక్రమ వ్యాపారం పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ కి మించి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం వ్యాపారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బెల్టాపు లు నిర్వహణ పై కేసులు నమోదు చేస్తామన్నారు. నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ భవనం పనుల కోసం మంత్రి శ్రీనివాసరెడ్డి రూ. 10 లక్షలు మంజూరు ప్రతిపాధనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఇంచార్జీ సీఐ టి.లత ఉన్నారు.

## ఆహార భద్రత కార్డులకు మరింత భద్రత

- మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు



**నేలకొండపల్లి, ఆగస్టు 24 ప్రజా జ్యోతి:** ఆహార భద్రత కార్డుల కు తెలంగాణ ప్రభుత్వం మరింత భద్రత కల్పిస్తుందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని కొత్త కొత్తూరు లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డు లను సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు....ప్రతీ పేదోడు కూడ సన్న బియ్యం ను తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. స్మార్ట్ కార్డు వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంత భారమైన ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. ఇటీవల ప్రభుత్వం అనేక నూతన రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ –పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య. సర్పంచ్ కళావతి, ఉప. సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూదన్రావు, జీపీవో జానిమియా, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు. మండలం లోని పలు పంచాయతీలలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమంలో సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ద్విచక్ర వాహనాల వేలం పాటలు

- ఎక్సైజ్ ,సీఐ ప్రశాంతి.



**కారేపల్లి, ఆగస్టు 24, ప్రజా జ్యోతి:** నేడు మంగళవారం రెండు ద్విచక్ర వాహనాల వేలంపాట నిర్వహించబడుతుందని ఎక్సైజ్ సీఐ ప్రశాంతి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ సింగరేణి మండల పరిధిలోని అప్పాయి గూడెం గ్రామంలో గల పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహంలో నిర్వహిస్తున్నటువంటి ఎక్సైజ్ కార్యాలయ ప్రాంగణంలో ఇటీవల నాటుసార తరలిస్తున్న క్రమములో పట్టుకున్న రెండు ద్విచక్ర వాహనాలను ఉదయం 11 గంటలకు వేలం పాటలు నిర్వహించబడనని ఆమె పేర్కొన్నారు. ఈ పాటలో పాల్గొనుటకు ఆసక్తి ఉన్నవారు 5000 రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆమె సూచించారు.

## సారంపల్లి మల్లారెడ్డి మృతి

- రైతాంగానికి తీవ్ర నష్టం
- తెలంగాణ రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు బిక్కసాని గంగాధర్.

**పాలేరు ఆర్.సీ ఆగస్టు24 ప్రజా జ్యోతి** రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి దేశ రైతంగానికి తీరని నష్టమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ డివిజన్ అధ్యక్షులు బిక్కసాని గంగాధర్ కోరారు. సారంపల్లి మల్లారెడ్డి అనారోగ్య కారణాలతో సోమవారం హైదరాబాద్ లోన్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో మల్లారెడ్డి మృతికిసంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు రమణారెడ్డి సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం సంఘం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గంగాధర్ మాట్లాడుతూ సారంపల్లి మల్లారెడ్డి ఉన్నత కుటుంబంలో జన్మించిన ఎమర్జెన్సీ కాలం నుండి కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, వ్యవసాయ రంగం సమస్యలపై, రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేసి వచ్చి బడుగు బలహీన వర్గాల కోసం, ముఖ్యంగా రైతుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలంగాణ రాష్ట్రంలో రైతాంగ సమస్యల అనేక పోరాటాలు నిర్వహించి రైతు పక్షాన ఉద్యమాలను నిర్మించారని తెలియజేశారు. నీటిపారుదల, రైతాంగ సమస్యలపై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పరిస్థితులలో అధ్యయనం చేసి పుస్తకాలు కూడా రచించారని, భారత దేశంలో సమస్యల సుడిగుండంలో సన్న చిన్నకారు రైతులు సమస్యలపై పుస్తకాన్ని రచించారని, కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా అనేక సెమినార్లు, సదస్సులు నిర్వహించారు, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాల సదస్సులు, మండల సదస్సులు రైతుల చైతన్యం కోసం అనేక సెమినార్లు, సదస్సులు నిర్వహించి, రైతులను చైతన్యపరిచేందుకు నిర్వహించే క్లాసుల కోసం జాతీయస్థాయి నాయకుడైన సామాన్య కార్యకర్త ఇవ్వలే రైలు, బస్సు, మోటార్ సైకిల్ పై తిరుగుతూ రైతులను చైతన్య పరుస్తూ దేశ విదేశీయ వ్యవసాయం పెట్టుబడులు పంట లాభనష్టాలు తదితర అంశాలపై దేశంలోని అన్ని ప్రాంతాలలో క్లాసులు నిర్వహించి ఎంతోమంది రైతులను చైతన్యపరిచా రు. సారంపల్లి మల్లారెడ్డి నేడు లేకపోవడం దేశ రైతాంగానికి తీరం నష్టమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిట్టూరి వెంకన్న,కర్ణ బాబు,గిరిజన సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షులు గన్యా నాయక్, నాగేశ్వరరావు, రైతు సంఘాల నాయకులు ఆరుట్ల శ్రీను, సీతారామయ్య, తెల్ల మేకల మాధవరావు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు చీర్ల చక్రి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## అప్పాయిగూడెం గ్రామ పంచాయతీలో పారిశుధ్య, డ్రైనేజ్ ,నూతన పైప్‌లైన్ పనులు

- సర్పంచ్ దండు ప్రవీణ్ కుమార్.



**కారేపల్లి, ఆగస్టు 24, ప్రజా జ్యోతి:** గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా మని సర్పంచ్ దండు ప్రవీణ్ కుమార్ అన్నారు. సింగరేణి మండల పరిధిలోని అప్పాయి గూడెం గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచ్ దండు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి బి. కృష్ణవేణిల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగించి, పరిసరాలను శుభ్రపరిచారు. అలాగే దోమలు, ఇతర వ్యాధికారక క్రిముల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది.అదేవిధంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టారు. జేసీబీ యంత్రం సహాయంతో డ్రైనేజ్ కోసం తవ్వకాలు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు.వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజల సౌకర్యం కోసం అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు తూ, రోడ్లపై చెత్త వేయకుండా గ్రామ పంచాయతీకి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కొండెక్కిన నిత్యవసరవస్తువుల ధరలు

- దిద్దుబాటు చర్యల్లో మోడీ సర్కార్ వైఫల్యం.
- ఆవుల అశోక్.

**కారేపల్లి, ఆగస్టు 24, ప్రజా జ్యోతి:** నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా వంట నూనెల ధరలు అంటకాగుతున్నాయి. చక్కెర చేదెక్కింది. బియ్యం, ఉప్పు, పప్పులతో పాటు కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి,మరోవైపు డీజిల్, పెట్రోల్ రేట్లు రోజువారీగా పెరుగుతూనే ఉన్నాయనీ సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి, కామేపల్లి సంయుక్త మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం సింగరేణి మండల పరిధిలోని టేకులగూడెంలో సోమవారం రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు .ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలు సైతం ఏ నెలకు ఆ నెల పెరుగుతూనే ఉన్నాయి. ఈ ధరల మంటను నియంత్రించడంలో కేంద్రంలోని మోడీ సర్కార్ ఘోరంగా విఫలమౌతున్నదనీ వారన్నారు. కేంద్రం సామాన్యుడిపై మితిమీరిన ఆర్థికభారాలు మోపుతున్నదని ఆర్థికరంగ నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేశారని వారన్నారు . డీమార్ట్, రిలయన్స్ వంటి కార్పొరేట్ దిగ్గజ సంస్థలు లక్షల టన్నుల ధాన్యాలను గిడ్డంగుల్లో అక్రమంగా నిల్వ ఉంచి, బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వాటిని విడిపించే కనీస ప్రయత్నం కేంద్రం వైపు నుంచి జరగట్లేదు. పైపెచ్చు దేశంలో నిత్యవసరవస్తువుల కొరతను సాకుగా చూపుతూ విదేశాల నుంచి ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతులు చేసుకొనేందుకు అవకాశాలు కల్పిస్తున్నది. అలా వచ్చిన సరుకు కూడా మళ్లీ కార్పొరేట్ల గోడౌన్లలోకే చేరుతున్నాయని అన్నారు. సింగరేణి మండలంలో కోతులు పంటలను నష్టపరుస్తున్నాయని ఇళ్లలో సైతం దాడి చేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోతుల నియంత్రణకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు సమయానికి పూర్తిచేసిన ఫైనల్ బిల్లు పడకుండా పెండింగ్ పెట్టి పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన సందర్భంగా ప్రభుత్వాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గుగులో తేజ నాయక్, మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి రాకేష్, భాస్కరరావు, అనుసూర్య, సరోజినీ, పుల్లకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# సర్..తప్పుల సవరణ కోసం 2 వేల మందికి నోటీసులు



**నేలకొండపల్లి, ఆగస్టు 24 ప్రజా జ్యోతి:** సర్ లో తప్పుల సవరణ కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం బీఎల్వో లతో ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...మండలం లోని వివిధ గ్రామలలో 2 వేల ఓట్ల మ్యాఫింగ్ కానట్లు గుర్తించామన్నారు. ఇక ముసాయిదా' పాత జాబితా లో చిన్న వ్యత్యాసాలు ఉన్నా...సవరించేందుకు 2 వేల మంది కి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి పేర్లు తప్పులు, అక్షర దోషాలు, పేర్లు తప్పులు చిన్న పాటి తప్పులు ఉంటే నోటీసులు ఇచ్చి బీఎల్ లతో ఆధారాలు చూపితే 'సరిదిద్దే అవకాశం ఉందన్నారు. ఆగస్టు 31 లోపు ఆయా బీఎల్వో ల వద్ద తప్పులు సరిదిద్దేందుకు ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటింటికి తిరిగి నోటీసులు అందించాలన్నారు. ఆ సమయంలో తప్పకుండా ఫోటో దిగి తన యాఫ్ లో ఆప్ లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, బీఎల్వీ లు పాల్గొన్నారు.

# సర్ ఫేజ్ 2 పై బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా అనామలీస్ మరియు నోమ్యాపింగ్ గా నమోదు కాబడిన ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారని, ఖమ్మం నియోజకవర్గ పరిధిలో 65,276, పాలేరు నియోజకవర్గ పరిధిలో 40698, మధిర నియోజకవర్గ పరిధిలో 27834, వైరా నియోజకవర్గ పరిధిలో 22,101,సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 20226 జిల్లా మొత్తంలో 1,76,135 మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారని.అర్హత గల ప్రతి పౌరునికి వోటు హక్కు కల్పించాలని కావున ఈ తరుణంలో బూత్ లెవెల్ ఏజెంట్లు బూత్ లెవెల్ ఆఫీసర్ తో కలిసి ప్రతి ఇంటికి వెళ్ళి నోటీస్ పై వోటర్లకు అహగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా ఇటీవల టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం మండల , పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను బూత్ లెవెల్ సూపర్ వైజర్ గా నియమించటం జరిగిందని, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు మండలంలోని అన్ని బూత్ లను పరిశీలించాలని, బూత్ లెవెల్ ఏజెంట్లకు తగు సలహా సూచనలు చేయాలని మండల, పట్టణ అధ్యక్షులను పత్రికాముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.అదే విధంగా 27-08-2026 న జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ -2026) ప్రక్రియలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో గ్రామ,వార్డు సభలు నిర్వహించనున్నారని కావున టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల ఆదేశానుసారం బూత్ లెవెల్ సూపర్ వైజర్ లు,బూత్ లెవెల్ ఏజెంట్లు, ముఖ్య నాయకులు ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని అందరు పాల్గొని అర్హత గల ప్రతి పౌరుని ఓటు జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని పత్రికాముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

# ఖాళీ స్థలాలను తేల్చేదెపుడు?

- **చొప్పకట్లపాలెం ఉపసర్పంచ్ పల్లా కొండలరావు, సిపిఎం నాయకులు**
- **బోనకల్ ప్రజావాణి లో ఫిర్యాదు**

**బోనకల్, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామకంఠం పరిధిలోని ఖాళీ స్థలాలను సర్వే చేసి గ్రామ పంచాయతీకి అప్పగించాలని ఉప సర్పంచ్ పల్లా కొండలరావు, సిపిఎం నాయకులు బండి శ్రీనివాసరావు, బోయినపల్లి పున్నయ్య, మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కొండేటి అప్పారావు కోరారు. బోనకల్ లో సోమవారం జరిగిన ప్రజావాణి లో వారు ఫిర్యాదు చేస్తూ గత ఐదు నెలలుగా చెబుతున్నా, గ్రామ సభ తీర్మానం చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడంతో పాటు సమస్యలు వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో వి.ఓ బిల్డింగ్ మంజూరు కాగా 46/1 సర్వే నెంబర్ లో కట్టాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆ స్థలం వద్దని పది రోజుల్లో తాము అనువైన స్థలం చూపుతామని మాజీ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బారావు, ఎపిఎం వెంకటేశ్వర్లు సమక్షంలో తెలుపగా అంగీకారం తెలిపారన్నారు. 15 రోజుల తర్వాత బిల్డింగ్ పనులు ప్రారంభం చేయగా రెవెన్యూ అధికారులు నిర్మాణం ఆపమని తెలిపారు. ఆ తర్వాత పరిణామాల్లో ఆగష్టు ఆరవ తేదీన బోనకల్ లో ఎంపిడిఓ, తహశీల్దార్,ఎపిఎం ఇతర అధికారుల సమక్షంలో జరిగిన అఖిలపక్షం, గ్రామ పంచాయతీ పాలకవర్గం సమావేశంలో వారం రోజుల్లో గ్రామానికి వచ్చి సర్వే చేసి గ్రామ పంచాయతీకి ఖాళీ స్థలాలను అప్పగిస్తామని చెప్పారు. 18 రోజులు గడిచినా ఎటువంటి కార్యాచరణ లేదు. గ్రామానికి మరో వి.ఓ బిల్డింగ్ కూడా మంజూరైన నేపథ్యంలో తక్షణమే రెవెన్యూ అధికారులు సర్వే చేసి గ్రామ పంచాయతీకి ఖాళీ స్థలాలను హద్దులతో సహా అప్పగించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా గొడవలు జరుగుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానంకు విలువ లేకుండా అధికారులు ప్రవర్తించడం ప్రజాస్వామ్య విరుద్ధమని తెలిపారు. గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం ఆగకుండా ప్రజాస్వామ్య యుతంగా ఎవరి ఒత్తిడులకు తలొగ్గకుండా పని చేయాలని కోరారు. ఈ ఫిర్యాదు పై వార్డు సభ్యులు బోయినపల్లి లక్ష్మి ,మార్కపుడి రజిని లు సంతకం చేశారు.



# బోనకల్ లో 4వ పోలింగ్ బూతును ఏర్పాటు చేయాలి

- **ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేసిన అఖిలపక్ష నాయకులు**



**బోనకల్, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి ):** బోనకల్ గ్రామంలో 4వ పోలింగ్ బూతును ఏర్పాటు చేయాలని బోనకల్ గ్రామ అఖిలపక్ష పార్టీ నాయకులు అధికారులను కోరారు. గ్రామ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం లోని ఎండిఓ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బోనకల్ గ్రామ ఓటర్లకు సంబంధించిన సమస్యలపై ప్రజావాణి అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బోనకల్ గ్రామంలో దాదాపు 3400 ఓటర్లు ఉన్నందున పోలింగ్ బూతులు మూడు మాత్రమే ఉన్నాయని, దీనివలన ఓటింగ్ సమయంలో ఓటర్లు క్యూ లైన్ లో ఎక్కువసేపు నిలబడవలసి వస్తుందని, కావున నాలుగవ పోలింగ్ బూత్ ని ఏర్పాటు చేయాలని ప్రజావాణి అధికారులను కోరారు. అలాగే ఇటీవల బి ఎల్ ఓ లు ఓటర్ల నుండి ఎన్యూరేషన్ ఫారంతో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటో కూడా సేకరించారని, కానీ డ్రాఫ్టింగ్ వాటర్ లిస్టులో పాత ఫోటోలు మాత్రమే వచ్చాయని కావున ఓటర్ల నూతన ఫోటోలతో డ్రాఫ్టింగ్ లిస్టు ని సవరణ చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, బిల్లా విశ్వనాథం, బిజెపి నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, గంగుల నాగయ్య, బిఆర్ఎస్ నాయకులు చిట్టోజు శ్రీనివాస్ (ఫోటో ప్రసాద్ ) తదితరులు ఉన్నారు.


# వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- **ఎంపీడీవో బి పద్మ.**



**కారేపల్లి, ఆగస్టు 24, ప్రజా జ్యోతి:** మండలంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని సింగరేణి మండల అభివృద్ధి అధికారిని బి. పద్మ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సింగరేణి మండల పరిధిలోని ప్రతి గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజల సహాయ సహకారంతో వన మహోత్సవ కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలి, ప్రతి ఒక్కరూ గ్రామంలోని రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాలలో, ప్రభుత్వ కార్యాలయ, దేవాలయ ప్రాంగణాలలో మొక్కలు నాటి ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటించి వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు.

# వరి సన్న రకాల నమోదు, డిజిటల్ క్రాప్ సర్వే





**ముదిగొండ ఆగస్టు 24(ప్రజా జ్యోతి )** ముదిగొండ మండలంలోని రైతు సోదరులందరూ సెప్టెంబర్ 10వ తేదీ లోపు వరి సన్న రకాల వివరాలను ఆన్లైన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు (7 రకాలు) సంబంధిత డీలర్ల వద్దే ఆన్లైన్ చేయించుకోవాలని, బయట కొనుగోలు చేసిన రైతులు ఏఈవో (ఎ ఈ ఓ )ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికి రైతులు తమ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, విత్తనాల బిల్లు మరియు బాండ్ పేపర్ను వెంట తీసుకురావాల్సి ఉంటుంది.అలాగే మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. వానాకాలం పంటలు వేసిన రైతులు తమ వివరాలను వాలంటీర్లకు తెలియజేసి నమోదు చేయించుకోవాలి. ఈ ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. పంట సాగు వివరాలను భవిష్యత్తులో ధాన్యం సేకరణ ప్రక్రియతో అనుసంధానం చేయనున్నారు కాబట్టి, రైతులు తమ పంట వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవడం ఎంతో ముఖ్యం. కావున రైతులు అందుబాటులో ఉండి డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా తమ వివరాలను వాలంటీర్ల వద్ద నమోదు చేసుకుని సరి చూసుకోవాలని ఏవో సరిత కోరారు.

# సిపిఎం నాయకుడు మృతి

- **ఘనంగా నివాళులర్పించిన సిపిఎం నాయకులు**

**ముదిగొండ ఆగస్టు 24(ప్రజా జ్యోతి )** ముదిగొండ మచ్చ వీరయ్య భవనంలో సిపిఎం పార్టీ కేంద్ర నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఈరోజు తెల్లవారుజామున 3 గంటలకు తుది శ్వాస విడిచారు మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ముదిగొండ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూఆయన మరణం పార్టీకి రైతాంగానికి తీరనిలోటని రైతు కూలీలు సమస్యలపై నిరంతరం అధ్యయనం చేసి పోరాట రూపాన్ని తెలియజేసే వాడని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు టిఎస్ కళ్యాణ్ వేల్పుల భద్రయ్య రైతు సంఘం మండల అధ్యక్షుడు కందుల భాస్కరరావు సిపిఎం పార్టీ మండల నాయకులు మంతెన దామోదర్ పుచ్చకాయల లక్ష్మయ్య ముదిగొండ గ్రామ సర్పంచ్ కట్టకూరు ఉపేందర్. చెరుకూరి ఉపేందర్ బుర్ర ధర్మయ్య పుచ్చకాయల లక్ష్మయ్య కనపర్తి శ్రీనివాసరావు మల్లారపు వెంకటేశ్వర్లు బట్టు హనుమంతరావు కాంచన లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ ప్రభుత్వం ఆటో మోటార్ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించినందుకు కృతజ్ఞత తెలియజేసిన జె ఏ సి నాయకులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నందు ఆటో మోటార్ వర్కర్స్ జెఏసి (JAC) ఆధ్వర్యంలో ఐ యన్ టి యు సి మోటారు రంగం జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ అధ్యక్షతన జరిగిన కృతజ్ఞత సభలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ,అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి ,పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐ యన్ టి యు సి ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కమర్తపు మురళి, ఐ యన్ టి యు సి నగర అధ్యక్షుడు నరాల నరేష్ మోహన్ నాయుడు మాట్లాడుతూ నిన్న జె ఏ సి నాయకుల తో జరిగిన చర్చలలో ఆటో మోటార్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకున్నారని కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షాన ఉంటుందని పేద ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వారు తెలియజేశారు.త్వరలోనే మీసమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని వారు తెలియజేశారు . నాయకులు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జె ఏ సి నాయకులు సి ఐ టి యు జిల్లా ఉపేందర్ బి ఆర్ టి యు నాయకులు షేక్ సత్తార్ మియా టి యు సి ఐ నాయకులు కంకణాల శ్రీనివాస్ టి యన్ టి యు సి నాయకులు గాడు రవీందర్ ఐ ఎఫ్ టి యు నాయకులు శ్రీకాంత్ ఏ ఐ టి యు సి నాయకులు రావుల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐ యన్ టి యు సి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు వీరేందర్ రెడ్డి నగర అధ్యక్షుడు తోట సైదులు పార్లమెంట్ అధ్యక్షుడు కటకూరి ఉమా రావు, యూనియన్ నాయకులు మైస ఆంజనేయులు , ఎండీ రఫీ ,లక్ష్మీనారాయణ , ఎస్.కె సలీం ,ముల్లర్ ,నాయుడు ,ఎస్.కె జానీ మియా,మేకల వినోద్,పండు ,కృష్ణ మాచారి ,శేఖర్ ,వెంకటేశ్వర్లు , శివరాత్రి నాగేశ్వరావు మరియు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# నేత్రదానం చేయండి - మరొకరికి చూపునివ్వండి

- ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా .రామారావు పిలుపు
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఖమ్మం
- జాతీయ అంధత్వ, దృష్టి లోపాల నివారణ కార్యక్రమం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు – నేత్రదానంపై విస్తృత అవగాహన."నేత్రదానం – శ్రేష్ఠదానం". మరణం తర్వాత కూడా ఇతరుల జీవితాల్లో వెలుగుగా బతికే గొప్ప అవకాశం నేత్రదానం ద్వారా సాధ్యమవుతుందని.,జాతీయ అంధత్వ మరియు దృష్టి లోపాల నివారణ కార్యక్రమంలో భాగంగా 2026 ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు జిల్లా వ్యాప్తంగా 'నేత్రదాన పక్షోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారి తెలిపారు.నేత్రదానానికి సంబంధించి ముఖ్య గమనికలు ప్రజలు గుర్తించాలి

**సమయం:** వ్యక్తి మరణించిన 6 నుండి 8 గంటలలోపు నేత్రదానం చేయాలని. ఒకరి ద్వారా ఇద్దరికి చూపు లభిస్తుందని.

**శరీరంలో మార్పు ఉండవు:** నేత్రదానం వల్ల మృతదేహ రూపంలో ఎటువంటి మార్పు ఉండదని; కేవలం పైభాగంలోని కార్నియాను మాత్రమే సేకరిస్తారని.

**అర్హత:** కామెర్లు, ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్ ఉన్నవారు తప్ప... బీపీ, టీబీ, ఆస్తమా, కళ్లద్దాలు ఉన్నవారు మరియు క్యాటరాక్ట్ (శుక్లాలు) ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చునని.

**ఉచిత రవాణా:** నేత్రదానం చేసిన వారి భౌతిక కాయాన్ని ఖమ్మంలోని ఆసుపత్రుల నుండి స్వస్థలాలకు చేర్చేందుకు ఉచిత వ్యాన్ సౌకర్యం కలదని నేత్రదానాన్ని మన కుటుంబ ఆచారంగా మార్చుకుందామని తెలియజేశారు.

# తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని జమలాపురం వాసిరెడ్డి కళ్యాణమండపంలో మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దోమందుల సామేలు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సామేలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన భట్టి విక్రమార్క నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ షరతులకు,హామీలకు అంగీకరించి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలలో అవకాశం కల్పిస్తానని పొత్తు పెట్టుకొని ఓట్లు వేయించుకున్నాడని ఎన్నికల తర్వాత పార్టీకి ఇచ్చిన ఏ ఒక్క షరతు గాని హామీను గానీ భట్టి విక్రమార్క నెరవేర్చలేదని విమర్శించారు.మండల తెలుగుదేశం,కాంగ్రెస్ నాయకులతో కలిపి సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తానని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని దానిని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ళు తెలుగుదేశం పార్టీ వారికి కూడా ఇస్తానని, స్థానిక ఎన్నికలలో అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారని, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తెలుగుదేశం పార్టీకి ఒక్కరికి కూడా అవకాశం ఇవ్వలేదని,సర్పంచ్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ వారికి అవకాశం ఇవ్వలేదని దీనిపై ఎన్నోసార్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకుపోయిన భట్టి విక్రమార్క కానీ మండల నాయకులు స్పందించలేదని తమకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను భట్టి విక్రమార్క అమలు చేయాలని డిమాండ్ చేశారు.రెండవసారి ఇందిరమ్మ ఇళ్లలోనైనా తెలుగుదేశం పార్టీకి అవకాశం కల్పించాలని, ప్రభుత్వం ద్వారా మంజూరు అయ్యే సంక్షేమ పథకాలలో తమకు కూడా అవకాశం ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన వృద్ధులకు, వికలాంగులకు,ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అవకాశం కల్పించాలని విదేశాల్లో చదువుకొని విద్యార్థులకు అంబేద్కర్ విదేశీ విద్యకు అందించే సహాయాన్ని అమలు చేయాలని కోరారు.గత మూడు సంవత్సరాల గా నిలిచిపోయిన ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఆయన అన్నారు. భూమాత లో అప్లై చేసిన ప్రతి రైతుకు పాస్ పుస్తకం అందించాలని, రాజుపాలెం సర్వే నెంబర్ 81,జమలాపురం రెవెన్యూలో ని సర్వే నెంబర్ 58 లోని రైతులకు వెంటనే పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర రెడ్డి, మండల రైతు నాయకులు జవాజి భాస్కరరావు,శీలం నాగిరెడ్డి,వేముల వెంకటేశ్వరరావు, దేవరకొండ మోహనరావు,కోగంటి సత్యనారాయణ, వాసిరెడ్డి శివకుమారి, వీరమాచనేని వెంకటకృష్ణ, యరమల కిషోర్ రెడ్డి,అజ్మీర వెంకటేశ్వర్లు,పిన్నబోయిన రాజా,వరి కూటి వెంకన్న,కర్నాటి శ్రీనివాసరెడ్డి,బోజెండ్ల నాగేశ్వర రావు,షేక్ లాలు,జానీ మియా, వంకాయలపాటి జగన్, బొగ్గుల సత్యనారాయణ రెడ్డి,కోగంటి నాగేశ్వర రావు,బుర్ర అనిల్, పామర్తి శ్రీను తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కి బోనకల్ ఎం జె పి కాలేజీ విద్యార్థులు



**బోనకల్, ఆగస్టు 24(ప్రజా జ్యోతి):** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు బోనకల్ ఎం జె పి కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 21న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ లో బోనకల్ ఎం జె పి కాలేజీ విద్యార్థులు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అసోసియేషన్ అథ్లెటిక్స్ పోటీలలో బోనకల్ బిసి గురుకులం విద్యార్థులు మణిశంకర్ 400 మీటర్ల ప్రథమ స్థానం సాధించాడు. శివశంకర్ 1000 మీటర్ల ప్రథమ స్థానం సాధించాడు. హై జంప్ లో విగ్నేష్ ప్రథమ స్థానం, రోహిత్ షాట్ పుట్ / డిస్కస్ ప్రథమ స్థానంగా గెలుపొందారు. వీరు ఈనెల 26,27 తారీకులలో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరిని ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్యాయ అధికారి సిహెచ్ రాంబాబు, ఖమ్మం జిల్లా డి సి ఓ, కళాశాల ప్రిన్సిపాల్ సుష్మ వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు, వెంకటేష్ క్రీడాకారులను అభినందించారు.

# కోల్డ్ స్టోరేజ్ యజమానులు తప్పనిసరిగా ట్రేడింగ్ లైసెన్స్ తీసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు



**మధిర ప్రజా జ్యోతి** వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల యజమానులు మరియు మిర్చి వ్యాపారులతో వ్యవసాయ మార్కెట్ కమిటీ మధిర చైర్మన్ శ్రీ బండారు నరసింహారావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలో మిర్చి వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులు మరియు కోల్డ్ స్టోరేజ్ యజమానులు తప్పనిసరిగా ట్రేడింగ్ లైసెన్స్ తీసుకోవాలని మార్కెట్ నిబంధనలకు అనుగుణంగా లైసెన్స్ పొందిన అనంతరం మాత్రమే వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మిర్చి వ్యాపారులు మరియు కోల్డ్ స్టోరేజ్ యజమానులు మార్కెట్ కమిటీ సూచనలను అంగీకరించి, నిబంధనల ప్రకారం ట్రేడింగ్ లైసెన్సులు తీసుకోవడానికి సమ్మతించారు. మార్కెట్ కమిటీ పరిధిలో వ్యాపార కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించేందుకు కమిటీకి పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో కోల్డ్ స్టోరేజ్ తనిఖీ బృందం టీమ్ లీడర్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్ శ్రీ జె. నరేందర్ తనిఖీ బృందం సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, మిర్చి వ్యాపారులు మరియు కోల్డ్ స్టోరేజ్ యజమానులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 19,20 తేదీలలో ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశాలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 19,20 తేదీలలో బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయాలో జరుగుతాయని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.అదే విధంగా అక్టోబర్ 28న ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు దేశవ్యాపిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రైల్వే రాయితీ పునరుద్ధరణ తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 19,20 తేదీలలో బోధ్ గయాలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అధ్యక్ష,కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు గోపాల్ మిశ్రా అధ్యక్షతన బోధ్ గయాలో జరిగే ఈ రెండు రోజుల జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ఆయా రాష్ట్రాల సమస్యలు, జాతీయ స్థాయి జర్నలిస్టుల సమస్యల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని మామిడి సోమయ్య తెలిపారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు తదితర అంశాలపై జాతీయ సమావేశాలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని, అదేవిధంగా అక్టోబర్ 28న ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగే నిరసన ప్రదర్శన కు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులను తరలిస్తామని అన్నారు.

# వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు
- అక్రమ విద్యుత్ కనెక్షన్లు, అధిక శబ్దం, రోడ్ల ఆక్రమణలకు తావు ఇవ్వద్దు
- నిమజ్జన పాయింట్ల వద్ద నీటి లభ్యతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి
- గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్, సిపి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాలు,నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమని,గణేష్ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అనుమతులు నిబంధనల మేరకు అందిస్తామని తెలిపారు.ప్రతి గణేష్ మండపానికి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మండపాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, పూర్తి రోడ్డు ఆక్రమించేలా మండపాలు ఏర్పాటు చేయరాదని సూచించారు.వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయరాదని అన్నారు. అనవసరంగా భారీ సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు.ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో గణేష్ నిమజ్జనానికి అవసరమైన నీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలి, ఎలా నిల్వ చేయాలి అనే అంశాలపై ముందుగానే చర్యలు ప్రారంభించాలని, నీటి నిల్వ సాధ్యం కాని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జనం పాయింట్ల వద్ద అవసరమైన బ్యారికేడ్లు, క్రేన్లు, త్రాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయాలు జరగకుండా మద్యనిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు.నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు.ప్రతి వినాయక మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, వైద్య తదితర అత్యవసర సేవల సంప్రదింపు వివరాలతో కూడిన చిన్న పోస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు.గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, నిమజ్జన రూట్లలో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.నిమజ్జన పాయింట్లకు అప్రోచ్ రోడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని, ప్రతి వినాయక మండపాన్ని రిజిస్టర్ చేసి,అక్కడ చేపడుతున్న ఏర్పాట్ల వివరాలను ముందుగానే సేకరించాలని అన్నారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా ఉన్న ఇంటర్నెట్, టీవీ కేబుళ్లను సరిచేయాలని సూచించారు.ప్రతి గణేష్ మండపానికి ప్రభుత్వం నిబంధనల మేరకు విద్యుత్ కనెక్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లైన్‌మ్యాన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ అందించేలా చూడాలని, ప్రజలు స్వయంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని ప్రమాదాలకు గురికావద్దని కలెక్టర్ కోరారు.పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ★ అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.నిమజ్జనం రోజున శోభాయాత్ర, చివరి పూజ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణాళిక చేసుకోవాలని కోరారు. విగ్రహాల తరలింపునకు అవసరమైన వాహనాలను ముందుగానే బుక్ చేసుకోవాలని, రూట్ మ్యాప్‌ను ముందుగానే ఖరారు చేసుకోవాలని సూచించారు.మున్సిపల్ కార్పొరేషన్, ఉత్సవ కమిటీలు,పోలీస్ అధికారులు సమన్వయంతో నిమజ్జన రూట్ మ్యాప్‌ను ఖరారు చేయాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచాలని,అవసరమైన డ్రైవర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ సెప్టెంబర్ 15లోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని తెలిపారు. నిమజ్జన రూట్లలో స్ట్రీట్ లైటింగ్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ★ ఖమ్మం జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ప్రతి సంవత్సరం అధికారులు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. ఈసారి కూడా అధికారులు, పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఫైర్, వైద్య శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు.ప్రస్తుతం మున్నేరు నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటిని ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిమజ్జన పాయింట్ల వద్ద కనీసం 7 ప్లాట్ ఫాం లు, 7 క్రేన్లు ఏర్పాటు చేయాలని కోరారు.సెప్టెంబర్ 14న వినాయక చవితి, సెప్టెంబర్ 23న నిమజ్జనం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి గణేష్ మండపానికి అవసరమైన అనుమతులు త్వరగా మంజూరు చేయాలని,ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ప్రతి మండపానికి అందేలా చూడాలని కోరారు.నిమజ్జనం రోజున నిర్వహించే శోభాయాత్ర రూట్‌లో రోడ్డు మరమ్మతులు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, విగ్రహాల తరలింపులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.గణేష్ మండపాల వద్ద అక్రమ విద్యుత్ కనెక్షన్లు లేకుండా, రోడ్లను పూర్తిగా ఆక్రమించకుండా ఉత్సవాలు నిర్వహించేలా కమిటీ సభ్యులు సహకరిస్తారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు,నిమజ్జనం జరిగేలా పోలీస్,జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.అనంతరం గణేష్ మండపం నిర్వాహకులకు సూచనలు తెలుపుతూ ముద్రించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, సిపి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్ కుమార్, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె.జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం.శ్రీహరి, సెక్రటరీ దోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్విత అన్న ప్రసన్న కార్యక్రమం

- అన్నీ ముందున్న ఉన్నా కలాన్ని అందుకున్న
- కర్రి రాజు - కుసుమ ముద్దుల కుమార్తె అన్విత



**నేలకొండపల్లి, ఆగస్టు 24 ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని నాచేపల్లి గ్రామంలో రాజు – కుసుమ ముద్దుల కుమార్తె అన్విత ఆరవ నెల అన్న ప్రసన్న కార్యక్రమం స్థానిక సంఘ పాస్టర్ వడ్లమూడి డేవిడ్ రాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు.పాస్టర్.సూరేపల్లి సుందర్ పాల్ వాక్య సందేశాన్ని అందించారు. స్థానిక సంఘ కాపరి పాస్టర్ డేవిడ్ రాజు దేవుని దీవెన ఆశీర్వాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ పెద్ద కాలెపంగు బాబురావు,సంఘ సభ్యులు,బంధువులు, స్నేహితులు, రక్తసంబంధికులు తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగింత - కారేపల్లి ఎస్ ఐ బి గోపి



**కారేపల్లి, ఆగస్టు 24, ప్రజా జ్యోతి:** మూడు నెలల క్రితం నమోదైన మిస్సింగ్ కేసులో కారేపల్లి పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి ఎట్టకేలకు యువతిని గుర్తించి సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు. పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన హైదరాబాదుకు చెందిన రుకుమ్ అనే యువకుడి పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం...సింగరేణి మండల పరిధిలోని బళ్లునగర్ తండాకు చెందిన ఓ యువతి అదృశ్యం అయినట్లు గత మే నెలలో యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. యువతి ఫోన్ లేకుండా వెళ్లడంతో ట్రేస్ చేయడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కారేపల్లి ఎస్ఐ టెక్నాలజీని ఉపయోగించి యువతి ఆచూకీని గుర్తించారు. యువతిని పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిని అదుపులోకి తీసుకుని, యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

## పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిపై పీడీ యాక్ట్

- పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న మీర్జా జిలానీ బేగ్ 48 సం,,పై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన మీర్జా జిలానీ బేగ్ 48 సం,,రేషన్ డీలర్లు, ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.నిందితుడిపై తల్లాడ పోలీస్ స్టేషన్లలో పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలుసంబంధించి మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి వైరా సిఐ వెంకట ప్రసాద్, తల్లాడ ఎస్సై వెంకట కృష్ణ నిందితుడిని అదుపులోకి తీసుకోని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.